పేరుకే పెద్దాస్పత్రి..
సౌకర్యాలు నిల్


ఆరుబయట భోజనం చేస్తున్న రోగుల సహాయకులు


రోగితో పాటు బెడ్డుపై నిద్రిస్తున్న సహాయకురాలు

- ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మూడు జిల్లాల సరిహద్దు కావడంతో చాలా గ్రామాల ప్రజలు వైద్యం కోసం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. రోగుల తాకిడిని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం కొలువయ్యాక వంద పడకల ఆస్పత్రికి గ్రహణం పట్టింది. వంద పడకల ఆస్పత్రి నూతన భవనం ప్రారంభానికి నోచుకున్నా.. పూర్తి స్థాయిలో నిర్మాణం కాకపోవడంతో పాత భవనంలోనే రోగులకు వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. కొత్త భవనంలో కేవలం ఓపీ సేవలు మాత్రమే నిర్వహిస్తున్నారు. నెలల తరబడి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. పాత భవనంలో తగినన్ని బెడ్‌లు లేక ఇద్దరు రోగులను ఒకే బెడ్‌పై ఉంచి వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే రోగుల తోడు వచ్చే సహాయకుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఆస్పత్రి పరిసరాల్లో రోగుల సహాయకులకు నిలువ నీడ లేక పోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. ఆరుబయటే తినడంతోపాటు అక్కడే నిద్ర పోవాల్సి వస్తుండటంతో రోగుల కంటే వారి పరిస్థితి దారుణంగా ఉంటోంది. రోగుల సహాయకులుగా వచ్చి సౌకర్యాలు లేక తాము కూడా రోగులుగా మారుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.


ఆస్పత్రి ఎదుట నిద్రిస్తున్న రోగి సహాయకురాలు

సౌకర్యాలు కల్పించాలి



ఆస్పత్రిలో రోగులకు సౌకర్యాలు కల్పించాలి. రోగుల వెంట వచ్చే సహాయకులకు ఆసుపత్రి ఆవరణలో షెడ్‌ల నిర్మాణం చేపట్టాలి. ఎలాంటి నిర్మాణాలు లేకపోవడంతో రాత్రి సమయంలో ఆరుబయటే నిద్రపోవాల్సి వస్తోంది. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణం చర్యలు చేపట్టాలి.

– రామాంజనేయులు, పెద్దపప్పూరు.

రోగులకు ఇబ్బంది



ఆస్పత్రిలో సౌకర్యాలు లేక కి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోగుల వెంట వచ్చే సహాయకులకు ఎలాంటి వసతులు లేక పోవడంతో ఆరు బయటే ఉండాల్సిన దుస్థితి. కనీసం ఆవరణలో భోజనం చేయడానికి కూడా వసతి లేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విశ్వనాథ్‌రెడ్డి, తాడిపత్రి

క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు: మండల కేంద్రమైన పెద్దవడుగూరులో కోట చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆదివారం మాఘమాస దశమి ని పురస్కరించుకుని కల్యాణం నిర్వహించాని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్యదాన కార్యాక్రమం నిర్వహించారు.

నేడు శివపార్వతుల కల్యాణోత్సవం

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం ఉన్న పురాతన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు హాజరు కావాలని వారు కోరారు. 25వ తేదీ అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు.

26 నుంచి శివరాత్రి వేడుకలు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరుడి ఆలయంలో ఈనెల 26న గ్రామస్తులు, భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహా శివరాత్రి వేడుకలను జయప్రదం చేయాలని ఈఓ క్రిష్ణయ్య ఆదివారం తెలిపారు. ఆ పర్వదినాన ఆలయంలో వేకువజామున 4 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఏకవార దశవార రుద్రాభిషేకం వంటి విశేష పూజాకార్యాక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు స్వామికి ప్రత్యేక అలంకరణ, సాయంత్రం 5 గంటలకు దివ్యదర్శనం, రాత్రి 10 గంటలకు శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

ఆటో, బైక్ ఢీ-ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని శ్రీధర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీధర్ బైక్‌లో రోడ్డుపైకి వస్తున్న సమయంలో ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కంపచెట్ల నడుమ ట్రాన్స్‌కో కార్యాలయం


నిరుపయోగంగా ట్రాన్స్‌కో కార్యాలయం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ట్రాన్స్‌కో అధికారులు సిబ్బంది ఉండడానికి ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వ బాలుర వసతి గృహం సమీపంలో లక్షల రూపాయలు వెచ్చించి నూతన కార్యాలయం నిర్మించారు. అప్పట్లో అధికారులు, కాంట్రాక్టర్ కార్యాలయం ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. రహదారి సక్రమంగా లేకపోవడంతో కార్యాలయం వైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. కార్యాలయం నిర్మానుష్య ప్రదేశంలో ఉండటంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. ప్రస్తుతం కార్యాలయం చుట్టూ తుమ్మ చెట్లు పెరగడంతో అధ్వానంగా తయారైంది. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన విద్యుత్ కార్యాలయం బూత్ బంగ్లా గా మారింది. అధికారులు స్పందించి ట్రాన్స్ కో కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చర్చిల్లో ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. దేవుడు సృష్టించిన సృష్టిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సృష్టికర్త, అందరికీ ప్రభువైన క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరం అవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహాం, బుజ్జిబాబు, రూబేను, రాజు, పాస్టరమ్మ సువర్ణమ్మ, డాక్టర్ కమల, రేచెల్, వాణి, మహిమ, లత, జ్యోతి, క్రైస్తవులు పాల్గొన్నారు.

నారాయణస్వామీ.. నమోస్తుతే



అలంకరణలో ఉత్సవమూర్తులు


దర్శనం కోసం క్యూలైన్లో వేచిఉన్న భక్తులు

పెద్దపప్పూరు: అశ్వర్థ నారాయణ క్షేత్రానికి నాలుగో ఆదివారం తిరుణాల సందర్భంగా ఆంధ్ర నుంచే గాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. పెన్నానదిలో పుణ్య స్నాణాలు ఆచరించి నారాయణస్వామి, చక్రభీమ లింగేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెన్నానదిలోని స్నాణగట్టాల వద్ద, తిరుణాలలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు ఏర్పాటుచేశారు. భక్తులకు దేవదాయశాఖ స్పెషలాఫీసర్ వన్నూరుస్వామి, ఈఓ సుబ్రహ్మణ్యం, గ్రామపెద్దలు సౌకర్యాలు కల్పించారు. భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు మొక్కుబడిలో బాగంగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్త జనసంద్రమైన కోటంక కొండ


స్వామి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు


స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు రామాచార్యుడు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో ఉన్న గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం భక్త జన సంద్రమైంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో ఆదివారం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.ఈసందర్భంగా ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామికి అభిషేకాలు,అర్చనలు తదితర విశేష పూజలు చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 సాలగ్రామ శివలింగాలకు భక్తులు పూజలు చేశారు. అలాగే ఏకశిల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం వద్ద భక్తులు సందడి చేశారు. అదే విధంగా భాస్కర్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, గాండ్ల విజయ భాస్కర్, విశాలక్షి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

గుంతకల్లు: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వెంకటేష్, సీపీఐ నాయకుడు వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌కు చెందిన ఆస్తులు అక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అగ్రిగోల్డ్ రాష్ట్ర నాయకుడు తిరుపతయ్య ఆస్తుల ఆక్రమణలపై ఫిర్యాదు చేయగా ఆయనపై అల్లరమూకలుచే దాడి చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.20 వేలు డిపాజిట్లు ఉన్నావారికి చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, పుల్లయ్య, ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డాగా క్రీడా మైదానం


కళాశాల క్రీడా మైదానంలో మందుబాబులు పగలగొట్టిన మద్యం సీసాలు

శింగనమల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. రోజూ సాయంత్రం అవగానే క్రీడా మైదానం బార్‌ను తలపిస్తోంది. మద్యం సేవించిన వారు సీసాలు క్రీడా మైదానం బయట వేయకుండా, అక్కడే పగులగొడుతున్నారు. పగిలిని మద్యం సీసాలు ఆటలాడుకునే విద్యార్థులకు గుచ్చుకుంటుండంతో ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు స్పందించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 మెయిన్స్


నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి 12.30కి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకూ విద్యార్థులు పరీక్ష రాశారు. కళాశాల ప్రధాన గేట్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు కళాశాల యాజమాన్యం తాగునీరు తదితర మౌలిక సదుపాయలు కల్పించింది. కాగా పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ పుణ్యవతి, సీఐ కరుణాకర్ తదితరులు పరిశీలించారు.

పరీక్షల్లో ప్రతిభ కనబరచండి


విద్యాసామగ్రి అందజేస్తున్న రొటేరియన్లు

గుంతకల్లుటౌన్: ఇంటర్, టెన్త్ పరీక్షల్లో మంచి ప్రతిభను కనబరచాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు శివానంద, జిల్లా రొటరాక్ట్ ప్రతినిధి నాగార్జున కర్ణాటకం సూచించారు. స్థానిక రోటరీస్కూల్‌లో ఆదివారం ప్రపంచ రోటరీక్లబ్ 120వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలల్లో చదువుతూ పరీక్షలు రాయనున్న సుమారు 1,250 మంది ఇంటర్, టెన్త్ విద్యార్థులకు రూ.70 వేలు విలువ చేసే ఎగ్జామ్ రైటింగ్ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ రొటేరియన్లు వీఎల్ గుప్త, శిరీష్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుత్తి: గుత్తి, గుంతకల్లు మున్సిపాలిటీల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గుత్తి ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీఈ సాయి శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 220 కేవీ సబ్ స్టేషన్‌లలో విద్యుత్ మెయింటనెన్స్ పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ రాఘవేంద్రప్ప

గుంతకల్లు రూరల్: ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం గడపాలని రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప సూచించారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని పాతకొత్తచెరువు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నాటుసారా, కర్ణాటక మద్యం బెల్టు షాపుల నిర్వహణకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, రోడ్డు భద్రతను పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. మట్కా, పేకాట తదితర వాటి జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవితం గడపాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



పోస్టర్ అతికిస్తున్న ఎస్ఐ కాటమయ్య

తాడిపత్రి రూరల్: సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పోస్టర్లను అతికించారు. సజ్జలదిన్నె గ్రామంలో పోస్టర్లను ఎస్ఐ కాటయ్య అతికించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన గ్రామీణులు ఎక్కువ పడుతున్నారన్నారు. అవగాహన లోపం వల్ల వానే నష్టపోతున్నారన్నారు. వారిలో చైతన్యం కలిగించడంతోపాటు సైబర్ నేరాల వల్ల మోసపోకుండా ఉండేందుకు పోస్టర్లను అతికిస్తున్నామన్నారు. సైబర్ నేరాలకు పాల్పడేవారిపై సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

బుగ్గలో 26 నుంచి శివరాత్రి ఉత్సవాలు


బుగ్గ సంగమేశ్వర ఆలయం

గుంతకల్లు రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. స్వామివారి దర్శనార్థం భారీగా తరలివచ్చే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. గుంతకల్లు పట్టణానికి 7 కిలోమీటర్లు, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుగ్గ సంగమేశ్వర ఆలయం చుట్టూ పచ్చని చెట్లతో భక్తులకు ఎంతో ఆహ్లాదమైన వాతావరణాన్ని కలిగింపజేస్తుంది. ఓవైపు భక్తులు, మరోవైపు పర్యాటకులతో ఆలయం నిత్యం రద్దీగా ఉంటుంది. ఏటా కార్తీక మాసంలో నెల రోజుల పాటు ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది.రాష్ట్ర నలుమూలల నుంచి మాత్రమే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భారీ ఎత్తున తరలివచ్చే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకుంటారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఆలయంలో నిరంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

ఆలయ చరిత్ర..

క్రీస్తుశకం 15వ శతాబ్దంలో పరమశివుడికి నిలయమైన కాశీక్షేత్రం నుంచి బయలుదేరిన ఒక బ్రాహ్మణుడు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటూ బుగ్గ సంగమేశ్వర ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వయంభుగా వెలసిన సంగమేశ్వర స్వామివారిని పూజిస్తూ గురువు ఆజ్ఞ మేరకు తాను ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించి వచ్చిన పుణ్యఫలం మొత్తాన్ని బుగ్గ సంగమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులకు అందేలా వరాన్ని ప్రసాదించాలని తపస్సు చేయడం ఆరంభించారు. తపస్సు అనంతరం మహాశివుడి వరం ద్వారా వచ్చిన పుణ్యఫలాన్ని సంగమేశ్వరుడికి ధార పోశారు. నాటినుండి నేటివరకూ బుగ్గ సంగమేశ్వరుడిని దర్శించుకున్న ప్రతి భక్తుడికీ ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించిన పుణ్యఫలం దక్కుతుందన్నది భక్తుల నమ్మకం. ఆలయ ముందుభాగంలో సాక్షాత్తు విష్ణు అంశమైన అశ్వత్థ వృక్షం ధ్వజ స్తంభంగా వెలసింది. శివకేశవ స్వరూపాలు కొలువుదీరి ఆంజనేయస్వామి క్షేత్ర పాలకుడిగా ఉంటున్న ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది.

ఆలయ విశిష్టత..

సంగమేశ్వరుడు మూల విరాట్‌గా మహావిష్ణువు ధ్వజ స్తంభంగా కొలువదీరిన ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. సంతానలేమితో బాధ పడుతున్న వారు, పెళ్లి కాని వారు ఐదు సోమవారాల పాటు స్వామివారిని దర్శించి అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించిన భక్తులు కోర్కెలు నెరవేరుస్తూ సంతాన సంగమేశ్వరుడిగా, కల్యాణ సంగమేశ్వరుడిగా స్వామివారు ప్రసిద్ధి చెందారు.

26 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం 4 గంటల నుంచిస్వామివారికి పంచామృతాభిషేకం, కలశ స్థాపన, నవగ్రహ పూజ చేస్తారు. భక్తుల కాలక్షేపం కోసం రాత్రి 9 గంటల నుంచి ఉదయం వరకూ వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి 12 గంటలకు పార్వతి బుగ్గ సంగమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 27వ తేదీ ఉదయాన్నే స్వామి వారికి అభిషేకం, మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి శ్రీవారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. 28వ తేదీ ఉదయం 6 గంటల నుంచి శ్రీవారి వసంతోత్సవం నిర్వహిస్తారు. అలాగే శివపార్వతులతోపాటు, వినాయకుడికి ఆలయ ప్రాంగణంలోని కోనేటిలో అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి



ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం, ఉత్సవాలు జరుగనున్న మూడు రోజుల పాటు ఆలయంలో భక్తులకు నిరంతరాయంగా అన్నదానం చేస్తాం. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. – ఈఓ క్రిష్ణయ్య

వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి క్రాస్ సమీపం, తాజ్ డాబా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాలు మేరకు.. గుత్తి వైపు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు 44వ జాతీయ రహదారి తలగాచిపల్లి క్రాస్ వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద డ్రైవర్ స్లో చేయగా అదే సమయంలో వెనుక నుంచి కారు ఢీకొంది. కారులో ఉన్న ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. అలాగే ఇల్లూరు నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో తాజ్ డాబా సమీపంలోకి రాగానే గార్లదిన్నెలో నుంచి ద్విచక్రవాహనంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా.. ఆటో డ్రైవర్ బ్రేక్ వేశాడు. వెనుకల వస్తున్న బైక్.. ఆటోను ఢీకొనడంతో ఆటో దెబ్బతిందన్నారు. ప్రయాణికులకు గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.